

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి  సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ద్వితీయం

"**తను** సాంబార్‌లో బెల్లం వేసేదికాదు" సురేంద్ర అభావంగా చెప్పాడు.

'తను' ఎవరో తెలుసుకాబట్టి విద్య తలాడించి నెమ్మదిగా చెప్పింది.

"అలాగే, ఇకనించి వేయను. మా ఇంట్లో అలవాటు."

అతను ముఖంలో ఎలాంటి భావంలేకుండా తినసాగాడు. ఏం చేయాలో తోచక ఆమె సోఫాలో కూర్చుండిపోయింది.

అమ్మో, నాన్న ఉంటే బావుండేది అనుకుంది. దింపడానికి వచ్చిన తండ్రి ఆ సాయంత్రమే వెళ్ళిపోయాడు. రెండు రోజులు ఉండమని ఎంత ప్రాధేయపడినా వినలేదు.

ఈ ప్రపంచంలోనే తను వంటరి అనే భావన కలిగింది ఆమెకి. కళ్ళు స్వల్పంగా చెమర్చాయి,

భోజనం ముగించిన సురేంద్ర లేచి ప్లేట్‌ని సింక్‌లో పెట్టి చెయ్యి కడుక్కుని వచ్చి ఆమె ఎదురుగా కూర్చున్నాడు.

'నువ్వు తిన్నావా?' అని అడుగుతాడనుకుంది. కానీ అతను ఆ స్పృహేలేనట్లుగా టీపాయ్ మీది పొద్దుటి పేపర్ని అందుకుని చదవసాగాడు. అసలు తనతో తినమంటాడని, తినేటప్పుడు కబుర్లు చెప్తాడని విద్య అనుకుంది కానీ అతను మౌనంగా, తనే వడ్డించుకుని తినేసాడు. ఆమెకి మళ్ళీ కన్నీళ్ళొచ్చాయి.

సురేంద్ర పేపర్ మడిచి పెట్టి, ఆమె వంక ఇబ్బందిగా చూస్తూ చెప్పాడు. "ఇంక పడుకుంటాను."

విద్యలేచి టేబుల్ మీది పదార్థాలని ఫ్రిజ్‌లో సర్ది, వంటింట్లో లైట్ ఆర్పేసి వచ్చింది. సురేంద్ర బెడ్‌రూంలోకి వెళ్ళిపోయాడు. ఆమెకి ఏం చేయాలో తోచలేదు.

ప్రతిఘటిస్తున్న మనసుని బుజ్జగించి బెడ్‌రూంలోకి నడిచింది. ఆమెని చూడగానే సురేంద్ర కొంచెం జరిగి మంచం మీద చోటిచ్చాడు. బిడియంగా పడుకుంది. అతని చెయ్యి ఆమెని చుట్టుకుంది.

అనుభవం ఉన్న అతను యాంత్రిక శృంగారం తర్వాత పక్కకి తిరిగి నిద్రపోతే, కన్నెచెర వదిలిన ఆమె కన్నీళ్ళతో మరో పక్కకి తిరిగింది.

ముప్పై ఏడేళ్ళ శ్రీవిద్య కథ చాలామంది ఆడపిల్లల కథలాంటిదే ఇరవైఏళ్ళకి బియస్సీ పాసై ఇరవైమూడేళ్ళకి బి.ఇ.డితో జిల్లాపరిషత్ స్కూలులో సైన్స్ టీచర్‌గా చేరింది. ఆమె సంపాదన తండ్రికి సోమరితనాన్ని, తల్లికి ఆశని పెంచింది.

ఫలితం తన చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయి పిల్లలు పుట్టినా, ఇంట్లో ఎవరూ ఆమె పెళ్ళిగురించి ఆలోచించలేదు. అడగడానికి విద్య సిగ్గుపడింది. ప్రతీరాత్రి ఆమెకి పెళ్ళిగురించి, సంసారం గురించి ఎన్నెన్నో కలలు. ఎవరో తెలియని భర్తమీద అవ్యాజమైన ప్రేమ. అతనికి తనమీదగల అనురాగం గురించి ఆలోచిస్తూ నిద్రపోయేది. ఈ వయసులో కూడా ఆమె మనసు టీనేజ్‌లోనే ఉండిపోయింది.

ఇన్నేళ్ళ తర్వాత ఆమె రెండో మరిది ఈ సంబంధం తెచ్చాడు. సురేంద్ర అతని బాస్. అల్లుడనే మొహమాటంతో విద్య తల్లితండ్రులు పెళ్ళిచూపులకి ఒప్పుకున్నారు. పెళ్ళికొడుక్కి నలభై రెండేళ్ళని, భార్య ఏక్సిడెంట్‌లో పోయిందని తెలిసిన విద్యకి ఆ రోజు కలలో తను ఇన్నేళ్ళుగా కాపురం చేస్తున్న భర్త రాలేదు. నిద్రకూడా రాలేదు.

పెళ్ళి చూపుల్లో అతన్ని చూసి 'పర్లేదు అంత వయసు తెలియడంలేదు' అనుకుంది. అతను తనవంక ఓ క్షణం చూసి తక్షణం కళ్ళు తిప్పుకోవడంతో తను నచ్చలేదేమో అనుకుంది.

కానీ నాలుగురోజుల తర్వాత మరిది ఫోన్ చేసి అతనికి ఇష్టమేనని, పదిరోజుల్లో ముహూర్తం ఉందని చెప్పాడు. తల్లితండ్రులు అయిష్టంగానే అంగీకరించారు. వారం తరువాత మరిది నించి మళ్ళీ కబురు.

"అతనికి పీటలమీద పెళ్ళి ఇష్టంలేదట. గుళ్ళో సింపుల్‌గా తాళికట్టి, తర్వాత రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళ్ళి సంతకాలు చేస్తే చాలుట."

శ్రీవిద్యకి అది రెండో నిరాశ. ఆమెకి చిన్నప్పటినించీ పీటలమీద పెళ్ళి అంటే ఇష్టం. సంప్రదాయం ప్రకారం జరిగే పెళ్ళిలో తను ఉత్సాహంగా తలంబ్రాలు పోయాలని, బిందెలోని ఉంగరాన్ని పోటీపడి గెల్చుకోవాలని ఇంకా చాలా కలలు కన్నది.

పెళ్ళిరోజున తెల్లచీరకట్టుకుని తృప్తిపడింది. సురేంద్ర దేవుడిముందు నిలబడి ఆమె మెడలో తాళికట్టాడు. తర్వాత రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సంతకాలు పెట్టి మేరేజ్ సర్టిఫికెట్‌కి అప్లై చేసారు. ఇద్దరివైపు నించి మొత్తం పాతికమందిదాకా హాజరయ్యారు అంతే! సురేంద్ర సెలవులేదని వెంటనే వెళ్ళిపోతే, టెన్త్‌క్లాస్ పరీక్షలయ్యేదాకా తనకీ సెలవు దొరకదని విద్య తన ఊరికి వెళ్ళిపోయింది.

పరీక్షలు పూర్తవగానే రెండేళ్ళు లాంగ్ లీవ్ పెట్టింది విద్య. 'నెలకి ఏభైవేల జీతం వదులుకుని సెలవుపెట్టిపోతావా?' అని తల్లి లబలబలాడింది.

"అమ్మా! నాకు ముప్పైఏడేళ్ళకి పెళ్ళయింది. ఇప్పుడైనా నాకో ముద్దూముచ్చట ఉండక్కర్లేదా?" అసహనంగా అరిచింది.

ఈ పదిహేను రోజుల్లో అతనినించి ఒక ఫోన్‌కాని, మెసేజ్ కాని రాలేదని ఆమెకి బాధగా, ఉక్రోషంగా ఉంది.

తల్లితండ్రులు అలిగారు. ఆమె పట్టించుకోలేదు. గుళ్ళో పూజారిగారిని మంచిరోజు అడిగి, ఆ రోజున వస్తున్నానని సురేంద్రకి మెసేజ్ చేసింది. 'తాళం చెవి డోర్‌మేట్ కింద పెట్టివెళ్తాన'ని సమాధానం వచ్చింది. అంతకుమించి ఒక్కమాటకూడా లేదు అందులో.

తల్లి రానంది. తండ్రి వెంట వచ్చాడు. సురేంద్ర చెప్పినట్లే తాళ చెవి డోర్‌మేట్ కింద ఉంది. ఇల్లు మూడు బెడ్రూమ్స్ ఉన్న అపార్ట్‌మెంట్. నీట్‌గా సర్దిఉంది. మాస్టర్ బెడ్ రూంలోని మంచాన్ని చూడగానే ఆమె గుండె లయ తప్పింది.

ఓ గంట కూర్చున్నాక తండ్రి లేచి బయలుదేరాడు. రెండురోజులైనా ఉండి వెళ్ళమని బతిమాలినా ఆయన వినలేదు.

వంటరిగా మిగిలిపోయిన విద్యలో అనంతమైన దుఃఖం. అందరిమీద కోపం. తనమీద అసహ్యం.

సాయంత్రం అవుతూండగా వంటగదిలో, ఫ్రిజ్‌లో వెదికి కనిపించిన పదార్థాలతో వంట చేసింది. స్నానం చేసి తెల్లటి కాటన్ చీర కట్టుకుంది.

'వచ్చారా?' అని అతనినించి ఒక్క మెసేజ్ లేకపోయినా 'వచ్చాం' అని తనే చెప్పింది.

ఆరవుతుండగా వచ్చాడు సురేంద్ర. ఏవిధమైన స్పందన లేకుండా ఆమెవైపు చూసాడు. పలకరింపుగా నవ్వింది.

మాట్లాడడానికి ఇద్దరూ మొహమాటపడ్డారు.

శ్రీవిద్య జీవితంలోని అతిముఖ్యమైన రోజు అలా గడిచింది.

సురేంద్ర మితభాషి. రోజు మొత్తంలో పదిమాటలు కూడా మాట్లాడడు. అవీ అవసరమైన వాటి గురించి అడిగేవే.

'కాఫీ' 'ఉప్పు' 'ఉతికిన బట్టలు ఎక్కడున్నాయ్?' 'వంటైందా?' ఇలాంటివి.

అతనిలో మొదటి భార్యపోయి, ఏడాది తిరక్క ముందే రెండో పెళ్ళిచేసుకున్నాడన్న గిల్టీ ఎక్కువగా ఉందని విద్య తేలిగ్గా గ్రహించింది. తనంతట తను కల్పించుకుని మాట్లాడినా వింటున్నాడో లేదో అనే అనుమానం వస్తూంటుంది.

"ఎందుకింత పరధ్యానంగా ఉంటున్నారు?" ఓ రోజు అడిగింది.

"నా స్వభావం అది" చెప్పాడు.

కాని అతని స్వభావం అదికాదని ఆమెకి తెలుసు. తీరిక సమయాల్లో అతని ఆల్బమ్ చూసినప్పుడు మొదటి భార్యతో అతను తీయించుకున్న అనేక ఫోటోలు కనిపించాయి. వాటిలో సురేంద్ర చాలా సరదాగా కనిపించాడు .ఆమెమీద నీళ్ళుచల్లుతూ, ఆమె వెనక నిలబడి వేళ్ళని కొమ్ముల్లా పెట్టి వెక్కిరిస్తూ ఆమె నడుం, భుజాలచుట్టూ చేతిని వేసి ధీమాగా చూస్తూ...

విద్య గుండెల్లో సన్నగా మంట! తనతో కూడా అలాగే ఉండచ్చుగా? ఆమె తనకన్నా అందగత్తేంకాదు. కాని మొదటి భార్య! ఆ ప్రత్యేకత ఎప్పుడూ ఉంటుంది.

ఆమె వచ్చిన నాలుగురోజులకి ఊళ్ళోనే ఉండే చెల్లెలు ఫోన్ చేసింది. "ఎలా ఉన్నావు అక్కా? ఈ నాలుగురోజులు నాన్న ఉండటంతో బిజీగా ఉండి ఫోన్ చేయలేదు."

"నాన్న అక్కడికి వచ్చారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. నీకు చెప్పలేదా? నిన్ను దింపేసి ఇక్కడికి వచ్చానని చెప్పారు. అక్క దగ్గర నాలుగురోజులు ఉండచ్చుగా నాన్నా అంటే అక్కర్లేదమ్మా, దానికి ఇప్పుడు ఎవరి సాయం అవసరంలేదు అన్నారు."

విద్యకి మార్క్స్ గుర్తొచ్చాడు. 'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే.'

"మనం హనీమూన్‌కి వెళ్దామా?" నెల తర్వాత అడిగింది.

సురేంద్ర తడబడ్డాడు.

"ఊటీ వెళ్దాం. మరీ దూరం కాదు" ఆశగా చూసింది.

"అప్పుడు ఊటీకే వెళ్ళాం" గొణిగాడు.

ఆమె మరేం మాట్లాడలేదు.

'అప్పుడు వెళ్ళింది నాతోకాదు. నువ్వు అనుభవించినవి నేను అనుభవించలేదు. రెండో భార్య అయినంత మాత్రాన అంత నిర్లిప్తంగా ఉండాలా?' అని అడగాలనుకుంది. కానీ అతని స్వభావం తెలుసుకాబట్టి ఊరుకుంది.

శ్రీవిద్య గర్భవతైంది. ట్రాన్స్ఫర్ కుదరకపోవడంతో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసింది. తండ్రి కాబోతున్నానన్న ఆనందం సురేంద్రలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆమెని అపురూపంగా చూసుకుంటున్నాడు. క్రమం తప్పకుండా చెకప్స్‌కి తీసుకెళ్తున్నాడు. అతనిలోని ఈ కోణం ఆమెకి ఆనందంగా, ఆశ్చర్యంగా ఉంది. అతను ఇంతకుముందు తండ్రికానందుకు మరీ సంతోషించింది.

శ్రీవిద్య పక్కన పడుకున్న పసికందుని మురిపెంగా చూసాడు సురేంద్ర.

"థాంక్యూ ఈ బంగారుబాబుకి తోడుగా ఇంకో చిట్టితల్లి పుడితే చాలు." తృప్తిగా చెప్పాడు.

"వద్దు. వీడొక్కడే చాలు" విద్య చెప్పింది.

"ఇప్పుడే డెలివరీ అయిందికదా! ఆ బాధలో అలాగే అనిపిస్తుంది" నవ్వాడు.

"లేదు. బాధేంలేదు. నేను ఒక్కడే చాలు అనుకుంటున్నాను. వీడికి పెద్దవాడనే బాధ్యతలు వద్దు. రెండోవాళ్ళకి జీవితాంతం ద్వితీయం అనే గుర్తింపులేని జీవితం వద్దు" విద్య స్థిరంగా చెప్పింది.

Click here to share your comments

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*